# పదిలం...పదిలం!

-పి.వి.బి.శ్రీరామమూర్తి

ఆకలితో ఆవురావురుమంటూ విస్తరి ముందు కూర్చున్నాడు అవతారం.

అవతారంలాగే విస్తరిలో అన్నం, అందులో వేసిన కందిపప్పూ సెగలు కక్కుతున్నాయి. మునివేళ్లతో అన్నం కెలికాడు. చేతివేళ్లు చురుక్కుమన్నాయి. "ఫేన్ వేయ్యొచ్చు కదా?"

"కరెంటు పోయిందండీ. ఇన్వర్టరు పెట్టించుకుంటే ఈ బాధ ఉండదని నేనందుకే..."

అతని అశ్రద్ధని ఎత్తి చూపుతున్నట్లనిపించిన అవతారం "చాల్లే... చేతిమీదకి వేసేందుకేం వుందా?"

"అయ్యో అదేమ్మాటండీ" అని లోనికెళ్లి అప్పుడే కాచిన నెయ్యి తెచ్చి వెయ్యబోతుంటే అవతారం చేయి పట్టబోయాడు.

"నెయ్యి వేడిగా ఉంది. చెయ్యి పట్టకండి" అన్న భార్య మాటలు కోపంలో వున్న అవతారానికి వినిపించలేదు. నెయ్యి వెయ్యడంలో లీనమైన సావిత్రి భర్త నెయ్యికి చెయ్యి పట్టడం చూడలేదు.

"అమ్మో..చంపేసావ్" అన్న గావుకేకకి చేతిలో నెయ్యి గిన్నె వదిలేసింది త్రుళ్లిపడి.

"అయ్యో...చెబుతూనే ఉన్నానుకదండీ" నొచ్చుకుంది.

నెయ్యంతా కిందపడి గచ్చుమీద పాకేస్తోంది. బట్ట తెద్దామని లోనికి పరుగు తీసింది. బట్టతో నేలని వత్తుతూ "ఇవాళెవరి మొహం చూసానో లేస్తూనే" అనుకుని నాలుక కరుచుకుంది.

"అవును. ఇప్పుడు నా మొహం నీకు పిల్లి మొహంలానో, శనిగొట్టు మొహంలానో కనిపిస్తుంది" పళ్లు కొరికాడు.

"సారీ అండీ. మీరే నిద్ర లేపారన్న విషయం మరచిపోయాను" అంది తెగ బాధపడిపోతూ.

చెయ్యి మండుతోంది. ఆకలితో కడుపు మండుతోంది. కోపంతో మనసు మండుతోంది. ఏ మంటని ముందుగా చల్లార్చుకోవాలో తెలీని అవతారం చేతివేళ్లను ఊదుకుంటున్నాడు.

"పోనీ అన్నం నేను కలిపేసేదా?" అడిగింది సావిత్రి.

అబ్బే! అవతారానికి సావిత్రి మాటల్లో వెనకటి ప్రేమ కనిపించలేదు. అదే పాత రోజుల్లో అయితే కాలిన ఆ చేతి వేళ్లని నోట్లో పెట్టుకుని కళ్లలోంచి అనురాగాన్నీ, మనసులోంచి అమృతాన్నీ, మాటల్లోంచి మకరందాన్నీ కురిపించేది.

"జబ్బు మనిషినా?" మాటల తూటాలు పేలుస్తూ గుడ్లగూబలా చూసాడు.

అన్నమూ చల్లారింది. పప్పూ చల్లబడింది. వేడి నెయ్యి పడి చురుక్కుమన్న కాలిన వేళ్ల మంటా చల్లారింది. పప్పు ముద్ద నోట్లో పెట్టుకున్నాడో లేదో తీపి మంటతో బుస్సుమన్నాడు.

"పప్పులో బెల్లం దిమ్మరించావా?"

"బెల్లం లేదండీ. చిటికెడు పంచదార వేసాను కమ్మగా వుంటుందనీ."

"ఏమిటీ.. చిటికెడేస్తేనే ఇంత తియ్యగా ఉందీ. ఇలారా... ఓ ముద్ద పెడతా తిను నీకే తెలుస్తుంది చిటికెడు వేసావో పిడికెడే వేసావో?" అన్నాడు.

"అయ్యో ఇవాళ శుక్రవారమండీ. ఎంగిలి పడను"

"ఇప్పటికే షుగరు కంట్రోలు కాక డైటింగులూ, ఫైటింగ్‌లూ చేస్తున్నా. ఇంత చక్కెరవేసి తగలెడితే.. ఆ చక్కెర వ్యాధెలా తగ్గి తగలడుతుంది?"

"పోన్లెండి. శుక్రవారం పూట అలా వదిలెయ్యకూడదు. ఇవాళ్టికి సరిపెట్టుకోండి. ఆ ఆవకాయ నంజుకుని కానిచ్చేయండి" అంది.

"అంటే.. నీ శుక్రవారం పట్టింపేగానీ నా ఆరోగ్యం ఏమైనా నీకక్కర్లేదా? నీకసలు నీ మడీ...తడీ, పూజా పునస్కారాలేగానీ నేనూ, నా ఆరోగ్యం అవసరంలేదు"

"అదేం మాటండీ. నేను నిత్యం ఆ తల్లిని కోరుకునేది నా పసుపు-కుంకుమలూ, మంగళసూత్రాల గురించే కదండీ" కొంచెం సిగ్గుపడుతూ అంది.

ఎలాగో మొత్తం మీద పప్పన్నం తిని కూర కలుపుకుని నోట్లో పెట్టుకున్న అవతారం మళ్లీ పరశురాముడయ్యాడు.

"ఇదేం కూర?"

"అదేంటండీ... వంకాయ కనిపించడం లేదా?"

"వంకాయ కూర సరే. దీంట్లో పులుపూ, కారం మానేసి ఏకంగా ఉప్పే దిమ్మరించావా? ఉప్పు పేకెట్ మొత్తం పోసేసావా?"

"అయ్యో... ఉప్పెక్కువయిందా? అవతల గ్యాస్ వచ్చిందని బండి వాడి కేకతో పరుగెత్తాను. ఈ హడావుడిలో కూరలో ఉప్పు వేసానో లేదో మరచిపోయి వేసేసినట్లున్నాను. పోనీ వదిలేయండి. నువ్వులపొడి మీకిష్టం. వేస్తా కలుపుకోండి" అంది నొచ్చుకుంటూ.

"ఆ చారు తగలెయ్యి"

"అయ్యో... రోజూ విసుక్కుంటున్నారని ఈ రోజు చారు పెట్టలేదండీ"

"పోనీ మజ్జిగయినా ఉందా?"

మాట్లాడకుండా పెరుగ్గిన్నె తెచ్చింది.

"ఏమిటీ పెరుగా? మజ్జిగ చేయలేదా? కొలెస్ట్రాల్ పెరిగి హార్టెటాక్ వస్తే..? ఇప్పటికే డాక్టర్ తిడుతున్నాడు కొలెస్ట్రాల్ శాతం తగ్గించడానికి ప్రయత్నం చేయడంలేదని. నీకు నామీద శ్రద్ధ పోయిందంటున్నారు. కొన్నాళ్లెక్కడికైనా పోతాను. మనుషులు దూరమైతేగానీ విలువ తెలీదు" అని కంచంలో చెయ్యి కడుక్కోబోతుంటే-

"ఆగండాగండి. మజ్జిగ తెస్తా" అని కవ్వంతో

త్రిప్పి మజ్జిగ పోసింది. మజ్జిగన్నం తిని చల్లబడ్డాడు.

"ఓసారీ బిపీ టెస్టు చేయించుకోండి" అంది వినీ వినపడనట్లు.

"అదొక్కటే తక్కువయింది" సణుక్కుంటూ మంచంమీద వాలాడు. అవతారానికి గొప్ప అసహనంగా ఉంది, అసంతృప్తిగా ఉంది. రేపట్నుంచీ వేసవి సెలవులు. ఎక్కడికైనా పోవాలి అనుకున్నాడు.

అంతలో ఫోన్ రింగయింది. వెంకట్రావు!

వెంకట్రావు చిన్ననాటి మిత్రుడు. బొంబాయిలో ఇంజనీరు. వైజాగ్ వచ్చేసాట్ట. ఇప్పుడు సెలవులో వున్నాడు. వాడికీ ఒకటే కొడుకు. స్టేట్స్‌లో స్థిరపడ్డాడు. కొన్నాళ్లు గడుపుదాం రమ్మని పిలుపు. ఆనందంతో దేవుని గదిలోకి అంగలేసుకువెళ్లాడు.

"ఇదిగో సావిత్రీ! రేపట్నుండీ సెలవులు. ఎల్లుండే నా క్యాంపు"

ఆ మాటలకు త్రుళ్లిపడింది సావిత్రి.


ఆ రోజు వంటలు పాడైనందుకు బాధపడుతూ తెలియకుండా మనసు కారుస్తున్న కన్నీటిని తుడుచుకుని "ఎక్కడికట?" అనడిగింది.

"మా వెంకట్రావు లేడూ...వాడు బొంబాయి నుండి వైజాగ్ వచ్చేసాట్ట. లీవ్‌లో వున్నాడట. కొన్నాళ్లు హేపీగా గడుపుదాం రమ్మని ఫోన్ చేసాడు. ఇక నువ్వూ నీ దేవీ హాయిగా ఉండండి. నేపోతున్నా" మనసు పొరల్లో దుఃఖం కోపంగా మారి నిష్ఠూరంగా వచ్చిన ములుకుల్లాంటి పలుకులతో.

"అదేం మాటలండీ. వెళ్లొస్తా అనండి. వెళ్లిరండి. మీకీ మధ్య కోపం బాగా పెరిగిపోయింది. అబ్బాయి అమెరికాలో సెటిలయినా ఆ కోపం నామీదే, చాకలి బట్టలు తేకపోయినా తప్పు నాదే. టీవీలో బొమ్మ రాకపోయినా నేరం నాదే. ఏంటో... ఎంత శాంతంగా సర్దుకుపోతున్నా తప్పులన్నీ నావే. వెళ్లిరండి మీ ఆనందమే నా ఆనందం" అంది పొంగుకొస్తున్న దుఃఖాన్ని బయటపడనివ్వకుండా బాత్రూంలోకి వెళ్లిపోయింది.

అవతారాన్ని భార్య మాటలు కరిగించలేదు. తప్పంతా భార్యదే ముమ్మాటికీ. కొడుకును అమెరికా వెళ్లవద్దని, పంపొద్దనీ సావిత్రి అన్న మాట నిజమే. కానీ వాడక్కడ అమ్మాయినే చేసుకుంటానన్నప్పుడు అవతారం వద్దన్నాడు. 'పోనీలెండి... మన తెలుగమ్మాయి మనమ్మాయే కదా' అని సపోర్టిచ్చింది. వారక్కడకొచ్చేయమంటే ఉద్యోగాలు వదులుకుని రాలేమంది భర్త వెళతానంటే.

పోనీ ఇంతకుముందులా సినిమాలకు రానంటుంది. సరదాలు, కులాసాలూ... ఊహూ... లేవు, ఎంతసేపూ పూజలే. ఇంతకుముందు తనొదిలేసిన కూరా పచ్చడి ప్రేమతో తినేది. ఇప్పుడో ఎంగిలి కంచాల్లో పడేస్తోంది. బుద్ధి రావాలి. మొండికేసాడు, భీష్మించాడు. గొప్ప హుషారుగా వైజాగ్‌కు వెళ్లాడు.



***

కబుర్లే కబుర్లు. ఆ నవ్వులు, ఆ ముచ్చట్లు...వారంరోజులు ఈ లోకం తెలీలేదు. ఇంట్లో వెంకట్రావు భార్య కూడా లేదేమో మరి చెప్పడానికి మాటలు దొరకవు. వచ్చిన వారంరోజుల్లో నాలుగుసార్లు భార్య ఫోన్ చేసింది. కావాలనే అందుకోలేదు.

"ఎవరూ?'' అన్నాడు వెంకట్రావు.


ఆఫీసరేసాడు.

అయితే ఈ వారంరోజుల్లో అవతారానికి నచ్చనివి రెండే జరిగాయి.



## సెంటిమెంట్!

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఆనంద్, గోదావరి చిత్రాల్లో హీరోయిన్గా నటించిన కమలినీ ముఖర్జీ 'హ్యాపీడేస్'లో చిన్న పాత్రతో సరిపెట్టుకుంది. 'లీడర్'లో కమలినీ అసలు నటించనేలేదు. ప్రస్తుతం ఆయన తాజాగా తీయబోయే 'లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్'లో కమలినీ నటించనున్నదనే వార్త టాలీవుడ్‌లో గుప్పుమంటోంది. ఇద్దరి కాంబినేషన్‌లో ఇంతకు ముందు వచ్చిన చిత్రాలు సూపర్‌హిట్ అయినట్లుగానే ఈ చిత్రం కూడా విజయం సాధించాలని కోరుకుందాం!




వెంకట్రావు వత్తిడి మీద విస్కీ టేస్ట్ చేసాడు రెండుసార్లు. సావిత్రికి పరమ రోత కలిగించే మరో అంశం సిగరెట్టు పీల్చడం.

"ఒరే! ఆ వాసన నాకు వెగటురా''

"ఒరే! ఇది బ్లాక్ సిగరెట్. దీనిలో లవంగం పొడి వుంటుంది. ఇది ఇంపోర్టెడ్‌ది'' బలవంతం చేసాడు.

సావిత్రి గుర్తుకొచ్చింది. కాల్చాలి. తనకిష్టంలేని పనులుచేసి కసి తీర్చుకోవాలి. శత్రువుమీద కసి తీర్చుకోవడంలోనే ఆనందం. శత్రువులంటే ఎవరో కాదు, పెద్దయితే అన్నదమ్ములు, యాభై దాటితే భార్యకు భర్త, భర్తకు భార్య. అందుకే ఫ్రెండుకు కంపెనీ ఇచ్చాడు. వెంకట్రావే నిప్పంటించాడు. అవతారం నోటినిండా పొగ తీసాడు. ముక్కులోంచి వదిలాడు. పొల మారాడు. దగ్గు...దగ్గు అయినా సిగరెట్టు వదల్లేదు. వక్కపొడి వేసుకున్నాడు. అదీ ఫారిన్‌దేమో... ఓహ్ ఏం స్మెల్?

నిజానికి అవతారంలో చిన్నప్పటినుంచీ కొన్ని కోర్కెలు దాగి ఉన్నాయి. దాంట్లో సిగరెట్ కాల్చడం, రెండోది జీవితంలో ఒక్కసారైనా మందు కొట్టడం. ఎన్నిసార్లో చిన్నతనంలోనూ.... ఉద్యోగస్థుడయ్యాక, పెళ్లయ్యాక అత్తమామలు, బంధువులూ అందరూ 'మా అవతారం లాంటి మనిషి దొరకడం అదృష్టం' అనేవారు. పిక్నిక్‌లో స్టాఫ్, కొలీగ్స్ ఒకసారి మందు ఓ పెగ్గు రుచి చూడమన్నా తనమీదున్న మంచి ముద్రకు మచ్చ పడుతుందేమోనని మొండికేసేవాడు. స్టాఫ్ బతిమాలీ బతిమాలీ మానేసినప్పుడు మరొక్కసారి బ్రతిమాలితే మందు కొడదామనో, సిగరెట్ కాలుద్దామనో అనుకునేవాడు. కానీ విచిత్రం. వాళ్లు మరి 'లాభంలేదు వీడిచేత ఆ రెండు పనులు చేయించలేము' అనుకునేవారేమో మానేసేవారు. అప్పుడు నోరూరేది. మనసు మారాం చేసేది. ఇంటికెళ్లి మాత్రం సావిత్రికి గొప్పగా చెప్పుకునేవాడు. ఆ మర్నాడో తరువాతో కొలీగ్స్ భార్యలు సావిత్రి దగ్గర ఆమె భర్తని పొగడడం, ఆ రాత్రి సావిత్రి ఆనందంతో అందించిన అధరామృతం, అమరసుఖం ముందు మందు, సిగరెట్టు ఇచ్చే ఆనందం ఏపాటివి? అనుకునేవాడు. ఓసారి సిన్మాలో ఎవరో పక్కన సిగరెట్టు కాల్చినప్పుడు సావిత్రికొచ్చిన కోపం, ఆ రాత్రి సిగరెట్టు కాల్చని భర్త దొరికిన అదృష్టంతో పొందిన ఆనందానుభూతి అవతారం మరచిపోలేనిది.

"సావిత్రీ! నేనే ఎప్పుడైనా సిగరెట్టు కాల్చేనే అనుకో?'' అన్నాడు.

"పీక పిసికేస్తా'' అంది రెండు చేతులతో అవతారం మెడ చుట్టూ చేతులు పెట్టి.

'అమ్మో... నిజంగానే గొంతు పిసికేటట్లు వుంది' అని సరదాక్కూడా ఆ మాట అనడం మానేసాడు. కాల్చడం సరేసరి.

నిజానికిప్పుడు సావిత్రి వుంటే? భయంతో చెమటల్లు పట్టాయి.

"మొదటిసారి సిగరెట్ కాల్చినప్పుడు ఇలాగే వుంటుందిలే. అందునా ఇది ఫారిన్ సిగరెట్టు'' అన్న వెంకట్రావు మాటలకు ఔనని తలూపాడు.

ఆ తరువాత వెంకట్రావు భార్య వచ్చేసింది. వెంకట్రావులో ఇదివరకటి ఉత్సాహం కనిపించలేదు. "మరో వారం ఉండకపోయావా?'' అన్నాడు.

మాట్లాడలేదామె. మధ్యాహ్నం వెంకట్రావు సతీమణి ముక్కంకాయ చేసింది. గొడ్డు కారం. కొబ్బరి పచ్చడి చేసింది. ఉప్పు కషాయం. సాంబారు చేసింది. గుమ్మెందేగానీ పంచదారమయం. ఇదే ఇంటి దగ్గరయితే శివతాండవం చేసేవాడు.

"అన్నయ్యగారూ! వదినగారి వంటల్లా ఉన్నాయా?''

"అద్భుతం. మీ వదినగారెందుకు పనికొస్తారు నీముందు''

"ఒరేయ్ అవతారం! నోర్ముయ్యరా...మా చెల్లెలుగా ఉండాలంటే ఈ సత్యభామ మరో జన్మనెత్తాలి'' అన్నాడు (ఆమె పేరు రుక్మిణి).

"నోర్మూయ్యండి. ఆ నోటితో ఎప్పుడన్నా మెచ్చుకోవడం తెలిస్తేగా?''

"మా ఆవిడకి నామీద అభిమానం ఎక్కువయినప్పుడు అలాగే నోరు అదుపు తప్పుతుంది. అదంతే'' అన్నాడు.

ఆవిడ కోపంతో కంచంలో చేయి కడుక్కుని లేచింది.

'మావాడి సహనం చూస్తే నాకు సోక్రటీస్ గుర్తుకొచ్చాడు. భార్య గయ్యాళితనాన్ని ఆయన స్పోర్టివ్‌గా తీసుకునేవాడట' అనుకున్నాడు.

భోజనాలయ్యాక సిగరెట్టు ముట్టించి కబుర్లలో పడ్డారు.

రుక్మిణి గదిలోకి వచ్చి "కూసే గాడిద మేసే గాడిదని పాడు చేస్తుం దని... అన్నయ్యగారికీ సిగరెట్టు అలవాటు చేసారా?'' అని విసురుగా వెళ్లింది. అవతారాన్ని మరచి వెంకట్రావు భార్యను బుజ్జగించడం, భార్య అతని చేతుల్ని విసిరికొట్టడం "మాట్లాడకండి. నాకసహ్యం. ఆ తాగుబోతు నోరేం వాగుతుందో తెలీదు'' అని లోపలికెళ్లిపోయింది.

వెంకట్రావు ముఖం జేవురించుకుపోయింది. సిగరెట్‌మీద సిగరెట్ వెలి గించి "దానిది ప్రథమ కోపంరా. రాత్రి మళ్లీ పొరపాటు అయిందని కాళ్లా వేళ్లా పడుతుంది. ఫూల్‌ఫెలో. వాళ్లమ్మదీ ఇదే ధోరణి'' అన్నాడు.

తను తిడుతున్నప్పుడు సావిత్రి ఏమాత్రం చలించక నేరస్థురాలిగా తలొంచుకున్న దృశ్యం కళ్లముందు కదలాడింది. అక్కడ్నించి అవతా రంలో అంతర్మథనం ప్రారంభమయింది. గడ్డ కట్టిన మూర్ఖత్వం కరగడం ప్రారంభమయింది. మరో నాలుగురోజులకు సావిత్రి నుండి ఫోన్.

"ఏమండీ! ఎలా వున్నారు? మందులేసుకుంటున్నారా? సారీ అండీ తప్పులన్నీ నావే. ఇంకెప్పుడూ ఉప్పు ఎక్కువ వేయనండీ, పప్పులో పంచ దార వేయనండి. కారం మీకు సరిపోయేటట్లు వేస్తానండీ. ఎందుకంటే ఈ పదిరోజుల్లో నేను చప్పటి పప్పే తింటున్నానండీ. మజ్జిగన్నంలో కూడా ఉప్పు మానేసానండీ. నాకిష్టమైన ఉప్పావకాయని పనిపిల్లకిచ్చేసానండీ. వాటిమీద వ్యామోహంవల్లనే మీ గురించి శ్రద్ధ తీసుకోలేదేమో అనిపిస్తోం దండీ. వచ్చేయండీ. మీరు లేకపోతే దేవుడిలేని గుడిలా వుందండీ ఇల్లు. వచ్చేయమన్నానని మీ ఆనందాన్ని చంపుకుని రాకండి. ఉంటానండీ. ఫోన్ చేస్తూ ఉండండి. అబ్బాయ్ ఫోన్ చేసాడు. వాడారుమాసాలు సెలవు పెట్టు కుని కోడలితో వస్తున్నాట్ట. ఉంటానండీ'' అని ఫోన్ పెట్టేయబోతూ ఉంటే-

'సావిత్రీ! నన్ను మన్నించు సావిత్రీ. తప్పు నాదే. వయస్సు నన్ను మార్చలేదు. అయామ్ రియల్లీ సారీ' అనాలనుకున్నాడు. కానీ పురుషా హంకారం అతని నోటినుండి ఆ మాటలను రానివ్వలేదు.

"సావిత్రీ! తలుపులు జాగ్రత్తగా వేసుకో. మరేమిటీ విశేషాలు? నాకోసం ఫోన్లు ఏమైనా వచ్చాయా? ఉంటా'' అని ఫోన్ పెట్టేసాడు.

'నా సావిత్రి దేవత. నేనే ఫూల్‌ని, బ్రూట్‌ని' అని మనసులో తనను తాను తిట్టుకున్నాడు.

సాయంకాలం మేడమీద పోర్టికోలో మిత్రునితో కబుర్లాడుతున్నాడు. ఎదురుగా ఉన్న శాఖోపశాఖల వటవృక్షం చుట్టూ కాకుల గోల. వాటి గూటి కవి చేరుకుంటున్నాయి.

"ఏంటి అవతారం! పరధ్యానంగా వున్నావు? ఇంటివైపు దృష్టి మళ్లిందా?'' అన్నాడు వెంకట్రావు.


"వెంకట్రావ్! ప్రకృతిని గమనిస్తుంటే మనకి ఎన్నో విషయాలు బోధపడ తాయి. ఆ పక్షులు చూడు. సాయంకాలం అయ్యేసరికి వాటి గుళ్లకవి ఎంత గుర్తుగా చేరుకుంటున్నాయో? ఎక్కడ ఉండవలసిన జీవులు అక్కడ ఉంటేనే అందం కదా?''

"అందం కాదు, పదిలం. నీకో నిజం చెప్పేదా? రుక్మిణి నామీద కోపంతో వాళ్ల తమ్ముడి దగ్గరకెళ్లిపోయింది నెలరోజులదాకా రానని. కానీ వారం రోజులు ఉండలేకపోయింది. అక్కడ పక్షులకు గూడు ఎంత పది లమో, మనకీ అంతే'' అన్నాడు.

"ఏం అనుకోకు వెంకట్రావ్! సావిత్రిని విడిచి ఎప్పుడూ ఇన్నాళ్లు ఉండ లేదు. రాత్రి పదిగంటల బస్సుకెళ్లిపోతాను'' అన్నాడు మనసు తీగ సావి త్రిని అల్లుకోవడానికి పరుగులు తీస్తుంటే.

"వైనాట్'' స్నేహితుని చేతిని సున్నితంగా నొక్కాడు వెంకట్రావ్.

★



## వరల్డ్ ఫాస్టెస్ట్ ట్రైన్

చైనాలోని షాంగై-హాంఘా నగరాల మధ్య ఇటీవల మేగ్నెటిక్ ట్రాక్ మీద నడిచిన ట్రైన్ (గంటకు 417 కి.మీ) ప్రపంచంలో అత్యంత వేగవంత మైనదిగా నమోదైందిట. ఈ నగరాల మధ్య ఏడాదికి 8 కోట్ల మంది ప్రయా ణిస్తుంటారుట. త్వరలో గంటకి 500 కి.మీ వేగంతో నడిచే రైలును రూపొం దించాలని చైనా ప్రయత్నిస్తోందిట. ప్రస్తుతం దానిపై రీసెర్చ్ నడుస్తోందిట.

